క్లుప్తంగా

కంప్యూటర్ శిక్షణను వినియోగించుకోండి



తెలకపల్లి: మండల కేంద్రంలోని సీఎల్ఆర్ కళాశాలలో విద్యార్థులకు ఏర్పాటు చేసిన ఉచిత కంప్యూటర్ శిక్షణ తరగతులను సద్వినియోగం చేసుకోవాలని ఎంఈఓ చంద్రుడు సూచించారు. శుక్రవారం సీఎల్ఆర్ విద్యాసంస్థలో ఉచిత కంప్యూటర్ శిక్షణ, స్పోకెన్ ఇంగ్లీష్ తరగులను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడారు. 35 సంవత్సరాలుగా తెలకపల్లి మండల మారుమూల ప్రాంతంలో నైపుణ్య విద్యను ఉచితంగా అందిస్తూ.. అనేక సౌకర్యాలు కల్పిస్తూ.. విద్యనందిస్తుందన్నారు. కార్యక్రమంలో రాజమహేందర్‌రెడ్డి, శ్యాంసుందర్‌రెడ్డి, పర్వత్‌రెడ్డి, రాజేందర్ రెడ్డి, మురళీధర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సైబర్ నేరాలపై జాగ్రత్తలు అవసరం




లింగాల: నేడు సమాజంలో నేరగాళ్లు వినూత్న రీతిలో సైబర్ నేరాలకు పాల్పడుతున్నారని వారితో అప్రమత్తంగా ఉండాలని సర్పంచ్ బండి ఎల్లయ్య, హెచ్‌సీ సహదేవ్ సూచించారు. క్రవారం మండల పరిధిలోని అవుసలికుంట ఆవరణలో మహిళా సంరక్షణ, కమ్యూనిటీ పోలీసింగ్, సైబర్‌నేరాలపై అవగాహన కల్పించారు. అపరిచిత వ్యక్తులకు బ్యాంక్ వివరాలు, ఏటీఎం, ఆధార్, పాన్ తదితర కార్డులు ఇవ్వరాదన్నారు. గుర్తు తెలియని వ్యక్తుల ఫోన్లకు స్పందించకూడదన్నారు. కానిస్టేబుళ్లు బాలరాజు, శివానంద్, వెంకటస్వామి, చంద్రయ్య, ఎంసీఓ మన్సూర్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా త్యాగరాయ ఆరాధన ఉత్సవాలు



కొల్లాపూర్: పట్టణంలోని రాజాబంగ్లా ఎదుట, నాయీబ్రాహ్మణ సంఘం ఆధ్వర్యంలో త్యాగరాయ ఆరాధన ఉత్సవాలు నిర్వహించారు. శుక్రవారం ఉదయం త్యాగరాయ చిత్రపటాన్ని సంప్రదాయ డోలు, నాదస్వర వాయిద్యాలతో ప్రధాన వీధులవెంట ఊరేగించారు. సాయంత్రం రాజాబంగ్లా ఎదుట కచేరి ఏర్పాటు చేశారు. స్థానిక నాయీ బ్రాహ్మణ విద్వాంసులతో పాటు, తమిళనాడుకు చెందిన విద్వాంసులు డోలు, నాదస్వరం, ఫ్లూట్ తదితర వాయిద్యాలతో తమ ప్రతిభను ప్రదర్శించారు. కార్యక్రమాల్లో నాయీబ్రాహ్మణ సంఘం నాయకులు, విద్వాంసులు సత్యం, సంజన్న, సుందరయ్య, విశ్వేశ్వర్, ఆనంద్, బాలరాజు, గోపి, వెంకటేష్, చక్రపాణి పాల్గొన్నారు.

ఇంటింటా జనసేన ప్రచారం



తాడూరు: మండల కేంద్రంతో పాటు ఆయా గ్రామాల్లో జనసేన నేత వంగ లక్ష్మణ్‌గౌడ్ ఇంటింటా ప్రచారం చేశారు. శుక్రవారం మండల కేంద్రంతో పాటు యాదిరెడ్డిపల్లిలో ఆయన పర్యటించి గ్రామాల్లోని ప్రజల సమస్యలను తెలుసుకుంటూ పార్టీ సిద్ధాంతాలను ప్రజలకు తెలియజేశారు. ఎన్నికల సమయంలో ప్రజలకు ఇచ్చిన హామీలను సీఎం కేసీఆర్ విస్మరించి ప్రశ్నించే వారిపై కేసులు నమోదు చేయడంతో పాటు బెదిరింపులకు గురి చేస్తున్నారన్నారు. జనసేన నాయకులు శేకర్, ప్రసాద్, రాకేష్, శివకుమార్, భాస్కర్, రాజు తదితరులు పాల్గొన్నారు.

పార్టీ పటిష్టతకు యూత్ సేవలు అవసరం



లింగాల: మండలంలో కాంగ్రెస్ పార్టీ పటిష్టతకు యూత్ కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తల సేవలు, కృషి ఎంతో అవసరమని కాంగ్రెస్ పార్టీ లీగల్ సెల్ రాష్ట్ర అధ్యక్షుడు చత్రునాయక్ అన్నారు. శుక్రవారం మండల పరిధిలోని దారారంలో మండల యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు శ్రీనివాస్‌రాథోడ్ అధ్యక్షతన యూత్ కాంగ్రెస్ సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా రాష్ట్ర, మండల అధ్యక్షుడు యూత్ కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలకు పార్టీ పటిష్టతపై పలు సూచనలు, సలహాలు ఇచ్చారు. రేనయ్య, కృష్ణనాయక్, అంజి యాదవ్, లక్ష్మణ్‌సాగర్, నరేష్ పాల్గొన్నారు.

మండల సభలో సభ్యుల ఆగ్రహం



సమావేశానికి హాజరైన అధికారులు, ప్రజాప్రతినిధులు



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీపీ శ్రీదేవి

తాడూరు: ప్రతి మూడు నెలలకు ఒకసారి నిర్వహించే సర్వసభ్య సమావేశానికి అధికారులు రాకుంటే ప్రజల సమస్యలు వినేది ఎవరని, సమావేశానికి రాని అధికారులపై ఎంతవరకు చర్యలు చేపట్టారని శుక్రవారం నిర్వహించిన మండల సర్వసభ్య సమావేశంలో సభ్యులు అధికారులను నిలదీశారు. ఎంపీపీ శ్రీదేవి అధ్యక్షతన సమావేశం నిర్వహించగా.. ముఖ్య అతిథిగా జెడ్పీటీసీ రోహిణి పాల్గొన్నారు. వ్యవసాయ శాఖపై ఏఓ సాయికుమార్ నివేదిక వెల్లడించగా.. సభ్యులంతా గత సమావేశానికి, ప్రస్తుత సమావేశాలను మాత్రమే దృష్టికి తీసుకురావాలన్నారు.

■ పాలుమూరులో అత్యవసరమైన విద్యుత్ సరఫరా లోపం, మెటీరియల్ లేకపోవడంపై అధికారులకు తెలియజేసినా.. స్పందించలేదని సర్పంచ్ నాగయ్య సభ దృష్టికి తీసుకొచ్చారు. కొత్త రేషన్‌కార్డులు ఎప్పుడు ఇస్తున్నారు, గ్రామాల్లో పింఛన్ల పంపిణీ సక్రమంగా అవ్వడంలేదని ఆయా గ్రామాల సభ్యులు విచారం వ్యక్తం చేశారు. ప్రతి గ్రామంలో లైబ్రేరీ ఏర్పాటు చేసుకునేందుకు ఎక్కడైనా.. ప్రభుత్వ పాత భవనాలు ఉంటే తమ దృష్టికి తీసుకొస్తే.. రూ.లక్ష వెచ్చించి మరమ్మతు నిర్వహిస్తామన్నారు. సమావేశంలో వైస్ ఎంపీపీ శివలీల, డీఎల్‌పీఓ రామ్మోహన్, సింగిల్‌విండో చైర్మన్ ఎండీ సమ్మద్‌పాష, తహసీల్దార్ కార్తీక్ కుమార్, వివిధ శాఖల అధికారులు, ఆయా గ్రామాల ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

సీఎం సహాయనిధి చెక్కు పంపిణీ



పెద్దకొత్తపల్లి: పేద ప్రజలకు ఆరోగ్యాన్ని బాగు చేసుకునేందుకు సీఎంఆర్ఎఫ్ పథకం ఎంతో ఉపయోగపడుతుందని కొల్లాపూర్ ఎమ్మెల్యే బీరం హర్షవర్ధన్‌రెడ్డి అన్నారు. సాతాపూర్‌కి చెందిన రమేష్‌కు సీఎంఆర్ఎఫ్ కింద మంజూరైన రూ.లక్ష ఎల్ఓసీని బాధిత కుటుంబ సభ్యులకు అందజేశారు. పరమేష్, గణేష్‌రావు, ప్రసాద్‌రావు పాల్గొన్నారు.

బాధిత కుటుంబానికి..

వెల్దండ: మండల పరిధిలోని పోతేపల్లికి చెందిన శేఖర్ అనారోగ్యానికి గురికావడంతో మెరుగైన వైద్యం నిమిత్తం సీఎంఆర్ఎఫ్‌కు దరఖాస్తు చేసుకున్నాడు. మంజూరైన ఎల్ఓసీని ఎమ్మెల్యే జైపాల్ యాదవ్ శుక్రవారం అందజేశారు.

మోసపూరిత పాలనను ఎండగట్టాలి



కార్యకర్తల సమావేశంలో మాట్లాడుతున్న డీసీసీ అధ్యక్షుడు డాక్టర్ వంశీకృష్ణ

ఉప్పునుంతల: మోసపూరిత వాగ్దానాలతో అధికారమే లక్ష్యంగా బంగారు తెలంగాణ పేరు చెప్పి బీఆర్ఎస్ మరోసారి ప్రజలను మోసం చేయాలని చూస్తుందని డీసీసీ అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే డాక్టర్ వంశీకృష్ణ ఆరోపించారు. శుక్రవారం మండలంలోని వెల్టూర్ స్టేజీ వద్ద ఓ ఫంక్షన్‌హాల్‌లో నిర్వహించిన కాంగ్రెస్ మండల స్థాయి ముఖ్య కార్యకర్తల సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలోనే రైతులకు ఉచిత కరెంట్ అమలు చేయడంతో పాటు విద్య, వైద్యం, అర్హులందరికీ పింఛన్లు, సాగునీటి ప్రాజెక్టులకు పెద్దపీట వేసిందన్నారు. ప్రభుత్వ వైఫల్యాలను ఎండగడుతూ కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు గ్రామాల్లో గడపగడపకు తిరిగి ప్రజలకు విడమరిచి చెప్పాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. కట్టా అనంతరెడ్డి, వెంకటేష్, రంగారెడ్డి పాల్గొన్నారు.

కాంగ్రెస్ పార్టీలో చేరిక..

మండలంలోని వెల్టూర్ స్టేజీ వద్ద ఓ ఫంక్షన్ హాల్‌లో శుక్రవారం నిర్వహించిన కాంగ్రెస్ ముఖ్య కార్యకర్తల సమావేశంలో మండలంలోని వెల్టూరు, జప్తీసదగోడు తదితర గ్రామాల నుంచి బీఆర్ఎస్‌కు చెందిన కొంతమంది నాయకులు, కార్యకర్తలు డీసీసీ అధ్యక్షుడు డాక్టర్ వంశీకృష్ణ సమక్షంలో కాంగ్రెస్‌లో చేరారు. వారికి వంశీకృష్ణ పార్టీ కాండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. లింగమయ్య, పెద్దయ్య, చిన్నయ్య, మనోహర్ పాల్గొన్నారు.

టీడీపీకి పూర్వవైభవం తీసుకురావాలి

చారకొండ: రాష్ట్రంలో టీడీపీకి కార్యకర్తలు, నాయకులు, అభిమానులు పూర్వవైభవం తీసుకురావాలని అచ్చంపేట నియోజకవర్గ ఇన్‌చార్జ్ మోపతయ్య అన్నారు. మండలంలో శుక్రవారం టీడీపీ ఆధ్వర్యంలో ఇంటింటి కార్యక్రమం ప్రారంభించారు. నియోజకవర్గ ఇన్‌చార్జ్ మోపతయ్య హాజరై కార్యక్రమాన్ని ప్రారంభించారు. అంతకు ముందు టీడీపీ జెండా ఆవిష్కరించారు. ఐలయ్య, శ్రీనివాస్ గౌడ్, కాశన్న, గౌస్, మహ్మద్, దస్తగిరి పాల్గొన్నారు.

కంటి వెలుగును సద్వినియోగం చేసుకోండి

కల్వకుర్తిరూరల్: కంటి వెలుగును సద్వినియోగం చేసుకోవాలని మండల పరిషత్ అధ్యక్షురాలు మనోహరా పిలుపునిచ్చారు. శుక్రవారం మండలంలోని తాండ్రలో కంటి వెలుగు శిబిరాన్ని ఎంపీపీ ప్రారంభించారు.

బల్మూర్: గ్రామాల్లో ఏర్పాటు చేస్తున్న కంటి వెలుగు కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఎంపీపీ వేనేపల్లి అరుణ సూచించారు. మండలంలోని వీరంరాజ్‌పల్లిలో ఏర్పాటు చేసిన కంటి వెలుగు కార్యక్రమాన్ని శుక్రవారం ఆమె సందర్శించారు.

బిజినేపల్లి: మండలంలోని పెద్దతండా గ్రామపంచాయతీ ఆధ్వర్యంలో కంటి వెలుగు కార్యక్రమాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని వైద్య ఆరోగ్య సిబ్బంది శుక్రవారం అవగాహన కల్పించారు. గ్రామంలోని ఇంటింటికి వెళ్లి కంటి వెలుగు కార్యక్రమంలో భాగంగా నిర్వహించే సేవలను వివరించి శిబిరానికి తరలించారు. సర్పంచ్ మంగ్లీ, వైద్యురాలు డా.తేజస్విని, లక్ష్మీ, గంగ పాల్గొన్నారు.



పెద్దతండాలో కంటి వెలుగు

వాల్‌పోస్టర్ విడుదల



అచ్చంపేట రూరల్: హమాలీ కార్మికులకు సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలని సీఐటీయూ జిల్లా సహాయ కార్యదర్శి మల్లేష్ డిమాండ్ చేశారు. ఈ నెల 29న తెలంగాణ ఆల్ హమాలీ కార్మికుల ఫెడరేషన్, సీఐటీయూ అనుబంధం ఆధ్వర్యంలో నిర్వహించనున్న చలో హైదరాబాద్ వాల్‌పోస్టర్‌ను శుక్రవారం అచ్చంపేట సివిల్ సప్లయ్ గోదాం వద్ద విడుదల చేశారు. ఈ సందర్భంగా మల్లేష్ మాట్లాడారు. సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ.. లేబర్ కమిషనర్ కార్యాలయాన్ని ముట్టడిస్తామని హెచ్చరించారు. పెద్ద జంగయ్య, చంద్రయ్య, రాము, తిర్పతయ్య, రేణయ్య, ఐక్కయ్య, జంగయ్య పాల్గొన్నారు.

పేద మైనార్టీల అభివృద్ధికే ప్రత్యేక పథకాలు



ఉప్పునుంతలలో ఇఫ్తార్‌లో పాల్గొన్న ముస్లింలు

బల్మూర్: బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలోనే తెలంగాణలో పేద ముస్లిం, మైనార్టీలకు ప్రత్యేక పథకాలు ప్రవేశపెట్టి వారి సంక్షేమమే లక్ష్యంగా పని చేస్తున్నామని ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే గువ్వల బాలరాజు అన్నారు. గురువారం రాత్రి మండలంలోని కొండనాగులలో ముస్లిం మైనార్టీలకు ఇచ్చిన ఇఫ్తార్‌లో పాల్గొన్నారు.

కొల్లాపూర్: పేద ముస్లింలకు ఇందిరాగాంధీ అభిమాన సంఘం జిల్లా అధ్యక్షుడు రంగినేని జగదీశ్వరుడు దుస్తులు పంపిణీ చేశారు. రంజాన్ మాసంలో ఆఖరి శుక్రవారం సందర్భంగా పట్టణంలోని శ్రీవాణి విద్యానిలయంలో పలువురు పేదలకు ఆయన రంజాన్ కానుకలు అందించి శుభాకాంక్షలు తెలిపారు. మధుసూదన్‌రావు, జమీల్ అహ్మద్‌ఖాన్, మెయిదీనవాజ్, జుబేర్, జునైద్ పాల్గొన్నారు.

ముస్లింలకు ఇఫ్తార్

ఉప్పునుంతల: రంజాన్ మాసం చివరి దినాన్ని పురస్కరించుకుని శుక్రవారం కాంగ్రెస్ మండల అధ్యక్షుడు కట్టా అనంతరెడ్డి ఆధ్వర్యంలో స్థానిక మసీదు వద్ద ముస్లింలకు ఇఫ్తార్ ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో నాయకులు కొత్త చిన్న జంగిరెడ్డి, నారాయణ్‌రెడ్డి, జనార్దన్‌రెడ్డి, జగన్‌మోహన్‌రెడ్డి, పెద్ద జంగిరెడ్డి, గఫార్, బురాన్, బషీర్ పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో జుమ్మతుల్ విదా



లింగాల: రంజాన్ పర్వదినం చివరి శుక్రవారం ముస్లింలు 'జుమ్మతుల్ విదా'ను భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఈ సందర్భంగా మండల కేంద్రంలోని జామా మసీద్‌లో ముస్లింలు మత గురువు సమక్షంలో ప్రత్యేక ప్రార్థనలు చేశారు. మండల పరిధిలోని గ్రామాల్లో జుమ్మతుల్ విదా జరుపుకొన్నారు. రంజాన్‌ను పురస్కరించుకుని మసీదులను, ఈద్గాలను విద్యుత్ దీపాలతో ముస్తాబు చేశారు.

పనుల పరిశీలన

కందనూలు: జిల్లా కేంద్రంలో నూతనంగా నిర్మిస్తున్న గ్రంథాలయ భవన నిర్మాణ పనులను శుక్రవారం గ్రంథాలయ చైర్మన్ హన్మంత రావు పరిశీలించారు. భవన నిర్మాణ పనులను త్వరితగతిన పూర్తి చేయాలని కాంట్రాక్టర్లకు సూచించారు.

నేటి నుంచి సమ్మర్ క్యాంప్

తెలకపల్లి: సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలలో సమ్మర్ స్పార్కిల్స్ 2023 క్యాంపు నిర్వహించనున్నట్లు ఆ పాఠశాల ప్రిన్స్‌పాల్ సాయిలత శుక్రవారం తెలియజేశారు. శిక్షణలో సాంఘిక, గిరిజన సంక్షేమ విద్యార్థులు పాల్గొంటారని చెప్పారు.

కొవ్వొత్తుల ర్యాలీ



తెలకపల్లి: ఉగ్రదాడిలో వీరమరణం పొందిన వీరజవాన్‌లకు మండల పరిధిలోని గౌరెడ్డిపల్లిలో భగత్ సింగ్ యూత్ ఆధ్వర్యంలో కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహించారు. ఉగ్రవాదుల దాడిని తీవ్రంగా ఖండించారు. భగత్ యూత్ అధ్యక్షుడు మల్లేష్, రవి, నరేష్, వెంకటేష్, ఆంజనేయులు పాల్గొన్నారు.

చెవిలో పూలతో వీఓఏల నిరసన



తాడూరులో వినతి అందజేస్తున్న వీఓఏలు



పెంట్లవెల్లిలో నిరసన వ్యక్తం చేస్తున్న వీఓఏలు



లింగాలలో..

నాగర్‌కర్నూల్, అచ్చంపేట, కల్వకుర్తి, కొల్లాపూర్‌లో వీఓఏల న్యాయబద్ధమైన డిమాండ్లను వెంటనే పరిష్కరించాలని అయిదు రోజులుగా నిరవధిక సమ్మె చేపడుతున్నారు. శుక్రవారం చెవిలో పూలు పెట్టుకుని నిరసన తెలిపారు. న్యాయపరమైన డిమాండ్లు పరిష్కరించాలని కోరుతున్నారు.

■ కొల్లాపూర్‌లో టీపీసీసీ ప్రధాన కార్యదర్శి రంగినేని అభిలాష్‌రావు కొల్లాపూర్‌లో వీఓఏలు చేపట్టిన నిరసన దీక్షలకు సంఘీభావం ప్రకటించారు.

చెవిలో పూలు పెట్టుకుని వీఓఏలు దీక్షలో కూర్చున్నారు. వారికి కనీస వేతనాలు ఇవ్వలేని పరిస్థితిలో రాష్ట్ర ప్రభుత్వం ఉండటం దారుణమన్నారు.

సీపీఎం సంపూర్ణ మద్దతు

■ నాగర్‌కర్నూల్‌లో వీఓఏల నిరవధిక సమ్మె శిబిరాన్ని సీపీఎం నాయకులు శుక్రవారం సందర్శించి వారి సమ్మెకు సంపూర్ణ మద్దతు తెలియజేశారు.

■ ఉప్పునుంతలలో వీఓఏలకు సీఐటీయూ జిల్లా సహాయ కార్యదర్శి మల్లేష్ మద్దతు తెలిపారు.

– 'సాక్షి' నెట్‌వర్క్



వెల్దండలో చెవిలో పూలుపెట్టుకుని నిరసన తెలుపుతున్న వీఓఏలు

గుణాత్మకమైన విద్య నవోదయతోనే సాధ్యం



మాట్లాడుతున్న డీఈఓ గోవిందరాజులు

బిజినేపల్లి: దేశంలో వినూత్న విద్య, బోధన విధానాన్ని అమలు చేసి బాలల సంపూర్ణ వికాసానికి వేసిన పునాదులే జవహర్ నవోదయ విద్యాలయాలు అని డీఈఓ గోవిందరాజులు అన్నారు. మండలంలోని నందివడ్డెమాన్‌లో గురువారం రాత్రి విద్యాలయ 29వ వార్షికోత్సవం నిర్వహించారు. కార్యక్రమానికి డీఈఓ గోవిందరాజులు, డీఎంహెచ్ఓ సుధాకర్‌లాల్ హాజరై మాట్లాడారు. చదువు, వసతి, నాణ్యమైన భోజనం ఉచితంగా అందిస్తూ.. ఒత్తిడిలేని విద్య, ఆటపాటలతో వికాసానికి పెద్దపీట వేసే గుణాత్మకమైన విద్యను నవోదయ విద్యాలయం అందిస్తుందన్నారు. డీఎంహెచ్ఓ సుధాకర్‌లాల్ మాట్లాడుతూ.. విద్య అనేది వ్యక్తిగత అభివృద్ధితో పాటు సమాజానికి దోహదపడేలా ఉండాలన్నారు. పాఠశాల పూర్వ విద్యార్థి సీఆర్పీఎఫ్ అసిస్టెంట్ కమాండెంట్ చంద్రప్రకాష్‌ను సత్కరించారు.

సృజనాత్మకతను వెలికి తీసేందుకే ప్రతిభా పరీక్ష

నాగర్‌కర్నూల్ రూరల్: విద్యార్థుల్లో సృజనాత్మకతను వెలికి తీసేందుకు ఇలాంటి ప్రతిభా పరీక్షలు ఉపయోగపడుతాయని డీఈఓ గోవిందరాజులు అన్నారు. ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో శుక్రవారం నిర్వహించిన ప్రతిభా పరీక్షలో విజేతలకు బహుమతి ప్రదానోత్సవ కార్యక్రమంలో పాల్గొని మాట్లాడారు. విద్యార్థులు భయాందోళనలు పోగొట్టడానికి, సృజనాత్మకతను వెలికి తీసేందుకు ఈ పరీక్షలు ఉపయోగపడుతాయన్నారు. శివవర్మ, అశోక్, కార్తీక్, రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

ప్రవేశ పరీక్షకు ఏర్పాట్లు పూర్తి

పెద్దకొత్తపల్లి: సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలలో ఈ నెల 23న అయిదో తరగతి విద్యార్థులకు నిర్వహించే ప్రవేశ పరీక్షకు ఏర్పాట్లు పూర్తి చేశామని గురుకుల పాఠశాల ప్రిన్స్‌పాల్ తెలియజేశారు. హాల్‌టికెట్, గుర్తింపుకార్డు, పెన్ను, ప్యాడ్ వెంట తీసుకురావాలన్నారు.

సీపీఆర్‌పై అవగాహన



పెద్దకొత్తపల్లి: ప్రస్తుతం సమాజంలో గుండె పోట్లు ఎక్కువై ప్రజలు మృత్యువాత పడుతున్నారని ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వద్ద ఏఎన్ఎంలకు, ఆశవర్కర్లకు, ఎల్‌హెచ్‌పీలకు సీపీఆర్‌పై డాక్టర్ విజయకుమార్ అవగాహన కల్పించారు. గుండెపోటు వచ్చి పడిపోయిన మనిషిని తమవంతుగా కృషి చేసేందుకు సీపీఆర్ పద్ధతి ఉపయోగపడుతుందన్నారు. విద్యుత్‌షాక్‌కు గురైనప్పుడు కూడా గుండె నాళాలో శ్వాస ఆడక మృతిచెందడానికి అవకాశం ఉంటుందని తెలియజేశారు. కార్యక్రమంలో సర్పంచ్ వెంకటేశ్వర్‌రెడ్డి, మశన్న, వైద్యులు రోహిత్, ప్రశాంత్, హిమబిందు పాల్గొన్నారు.

కుప్పగండ్లలో పోలీస్ పికెట్

వెల్దండ: మండల పరిధిలోని కుప్పగండ్ల ముస్లిం ప్రార్థనా మందిరం వద్ద శుక్రవారం ఎస్ఐ శ్రీనివాస్ ఆధ్వర్యంలో పోలీస్ పికెట్ నిర్వహించారు. గ్రామంలోని ప్రార్థనా మందిరానికి ప్రహరీ నిర్మాణం చేపట్టారు. ప్రభుత్వ స్థలం కబ్జాకు గురవుతుందని, ఎలాంటి అనుమతులు లేకుండా నిర్మాణ పనులు చేపట్టారని సర్పంచ్, కార్యదర్శులు జిల్లా అధికారులకు ఫిర్యాదు చేశారు. రంజాన్ పర్వదినం సందర్భంగా ఎలాంటి సంఘటనలు చోటుచేసుకోకుండా ముందస్తుగా పోలీస్ పికెట్ ఏర్పాటు చేశామని చెప్పారు.

క్రీడాకారులకు చేయూత

కల్వకుర్తి రూరల్: క్రీడాకారులకు ఐక్యతా ఫౌండేషన్ చేయూతనందిస్తుందని ఫౌండేషన్ ఎగ్జిక్యూటివ్ మెంబర్ సుంకిరెడ్డి వరప్రసాద్‌రెడ్డి అన్నారు. శుక్రవారం మండలంలోని జిల్లెలలో ఐక్యతా ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన క్రికెట్ పోటీలను ప్రారంభించడంతో పాటు క్రీడాకారులకు క్రికెట్ కిట్లను అందజేశారు. కార్యక్రమంలో సర్పంచ్ జంగయ్య, శేఖర్‌రెడ్డి, పాండు గౌడ్, క్రీడాకారులు పాల్గొన్నారు.

స్వయం ఉపాధితో ఎదగాలి

కల్వకుర్తి రూరల్: యువకులు స్వయం ఉపాధితో ఎదగాలని బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు విజయ్‌కుమార్‌రెడ్డి కోరారు. శుక్రవారం మండలంలోని తాండ్రలో ఎస్‌బీఐ ఖాతాదారుల సేవా కేంద్రం కస్టమర్ సర్వీస్ పాయింట్‌ను ప్రారంభించారు. ఈ సందర్భంగా యువకులు జశ్వంత్‌ను అభినందించారు. శ్రీకాంత్‌రెడ్డి, జంగయ్య గౌడ్, ఆంజనేయులు యాదవ్, సుదర్శన్, ఆనంద్ తదితరులు పాల్గొన్నారు.

పోగొట్టుకున్న ఫోన్ అప్పగింత

అచ్చంపేట రూరల్: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ప్రవేశపెట్టిన సెంట్రల్ ఎక్విప్‌మెంట్ ఐడెంటిటీ రిజిష్టర్ ట్రేస్ అవుట్ సిస్టం ద్వారా జిల్లాలో అచ్చంపేట పోలీస్‌స్టేషన్ పరిధిలో మొట్టమొదటిసారి పోగొట్టుకున్న ఫోన్‌ను బాధితురాలికి అచ్చంపేట పోలీసులు అందించారు. సెల్‌ఫోన్ పోగొట్టుకున్న ఓరుగంటి జ్యోతి ఇటీవల అచ్చంపేట పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. అతికొద్ది సమయంలో టెక్ టీం సిబ్బంది అనిల్‌కుమార్‌గౌడ్, మహేష్, బాల్‌రాంనాయక్ సెల్‌ఫోన్‌ను కనుగొన్నారు. శుక్రవారం డీఎస్పీ కార్యాలయంలో ఎస్పీ మనోహర్, డీఎస్పీ కృష్ణకిషోర్, సీఐ అనుదీప్, ఎస్ఐ గోవర్ధన్ ద్వారా బాధితురాలికి ఫోన్‌ను అప్పగించారు. టెక్ టీం సిబ్బందిని ఎస్పీ మనోహర్ అభినందించారు.

28 నుంచి జూనియర్ పంచాయతీ కార్యదర్శుల సమ్మె

అచ్చంపేట రూరల్: జూనియర్ పంచాయతీ కార్యదర్శుల ప్రొబేషన్ కాలం పూర్తయ్యిందని, రెగ్యులరైజేషన్ చేయాలని జూనియర్ పంచాయతీ కార్యదర్శుల సంఘం జిల్లా గౌరవ అధ్యక్షుడు రాజేశ్వర్ కోరారు. శుక్రవారం అచ్చంపేట ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ప్రభుత్వ విప్ గువ్వల బాలరాజును నియోజకవర్గంలోని అన్ని గ్రామాల జూనియర్ పంచాయతీ కార్యదర్శులు కలిసి వినతి అందజేశారు. తమ సమస్యల పరిష్కారం కోసం ఈ నెల 28 నుంచి నిరవధిక సమ్మె చేపడుతున్నామని, సమస్యలను సీఎం దృష్టికి తీసుకెళ్లాలని కోరారు. ప్రదీప్, గంగారం, మహేష్, శ్వేత, మంజుల తదితరులు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో పూజలు



కల్వకుర్తి రూరల్: పట్టణంలోని వాసవీ కన్యకాపరమేశ్వరి దేవాలయంలో వైశాక మాసం సందర్భంగా శుక్రవారం భక్తిశ్రద్ధలతో పూజలు నిర్వహించారు. పెద్ద సంఖ్యలో పాల్గొని అమ్మవారికి కుంకుమార్చన కార్యక్రమం నిర్వహించారు.

మా భూమి ఇప్పించి న్యాయం చేయండి

పెంట్లవెల్లి: మండల కేంద్రానికి చెందిన మల్లయ్య, మణెమ్మలు మా భూమి మాకు ఇప్పించాలని కోరుతూ.. శుక్రవారం పెంట్లవెల్లి పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. భూమిని కొనుగోలు చేసి 14 సంవత్సరాలుగా శిస్తు చేస్తున్నామని అన్ని విధాలుగా హక్కులు మాకే ఉన్నాయని తెలియజేశారు. న్యాయం చేయాలని కోరారు.

అంబేడ్కర్ జీవిత చరిత్ర పుస్తకాల పంపిణీ

ఉప్పునుంతల: బాలుర ప్రాథమిక పాఠశాలలో విద్యార్థులకు శుక్రవారం గ్రామానికి చెందిన దాత రామచంద్రయ్య సహకారంతో అంబేడ్కర్ జీవిత చరిత్ర పుస్తకాలను అందజేశారు. వేసవి సెలవులను పురస్కరించుకుని చివరి రోజు విద్యార్థులకు పాఠశాలలో వీడ్కోలు సమావేశం నిర్వహించారు. వేసవి సెలవుల్లో విద్యార్థులు తీసుకోవాల్సిన జాగ్రత్తలను ఉపాధ్యాయులు వివరించారు. కట్టా సరిత, లక్ష్మీనారాయణ, బాలమణి పాల్గొన్నారు.

కార్మికుల హక్కులు కాపాడుకుందాం

కల్వకుర్తి రూరల్: కార్మికుల హక్కులను కాపాడుకోవాల్సిన బాధ్యత అందరిపై ఉందని, మేడే ఉత్సవాలను ఘనంగా నిర్వహించాలని సీఐటీయూ రాష్ట్ర ఉపాధ్యక్షురాలు విజయలక్ష్మి పిలుపునిచ్చారు. శుక్రవారం పట్టణంలోని సీఐటీయూ కార్యాలయంలో జిల్లా అధ్యక్షుడు ఆంజనేయులు అధ్యక్షతన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడారు. మే 1 నుంచి ఏడో తేదీ వరకు నాగర్‌కర్నూల్ జిల్లాలో ఉత్సవాలు ఘనంగా నిర్వహించాలన్నారు. కేంద్రంలో బీజేపీ ప్రభుత్వం అనుసరిస్తున్న కార్మిక వ్యతిరేక విధానాలపై పోరాడాలన్నారు. ఈశ్వర్, రామయ్య, అశోక్, మల్లేష్, ఫసియోద్దిన్, శివరాములు తదితరులు పాల్గొన్నారు.